కొత్త ఏడాదిలో ఆధ్యాత్మిక శోభ

2024లో ప్రారంభం కానున్న ప్రముఖ ఆలయాలు

న్యూఢిల్లీ: కొత్త ఏడాది దేశంలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లనున్నది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న అయోధ్య రామాలయంతో పాటు వివిధ ప్రాంతాల్లో పలు ప్రముఖ ఆలయాల ప్రారంభోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. వేటికవే సాటి అన్నట్టుగా ఆయా ఆలయాల నిర్మాణాలు దాదాపు పూర్తి కావొచ్చాయి. నిర్మాణపరమైన అద్భుతాలు, సాంస్కృతిక వైభవం ఆ ఆలయాల్లో కనిపిస్తున్నాయి. కొత్త ఏడాది ప్రారంభం కానున్న ఆ మహాలయాలు, వాటి విశిష్టతలు, విశేషాలను ఒక్కసారి చూద్దాం.

అయోధ్య రామ మందిరం

ఉత్తరప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరమైన అయోధ్యలో జనవరి 22న రామమందిర ప్రారంభోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏ విధమైన ప్రకృతి విపత్తు వచ్చినా దాదాపు 2500 ఏండ్ల పాటు తట్టుకొనేలా నిర్మిస్తున్న ఈ ఆలయం పూర్తి కావొచ్చింది. రాముడి కొలువై ఉండే గర్భగుడిని అష్టభుజి ఆకారంలో నిర్మిస్తున్నారు. ఆలయ ప్రారంభోత్సవానికి దేశ, విదేశాలకు చెందిన వేలాది మంది ప్రముఖులకు ఇప్పటికే ఆహ్వానాలు అందాయి.

నిర్మాణం పూర్తికావొచ్చిన శ్రీ మాయాపూర్ చంద్రోదయ మందిర్

శ్రీ మాయాపూర్ చంద్రోదయ మందిర్-పశ్చిమబెంగాల్

శ్రీ మాయాపూర్ చంద్రోదయ మందిర్ లేదా టెంపుల్ ఆఫ్ వేదిక్ ప్లానేటేరియం(టీవోవీపీ) పశ్చిమబెంగాల్‌లోని మాయాపూర్‌లో నిర్మితం అవుతున్నది. 113 మీటర్ల ఎత్తుతో ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ ఆలయంగా ఇది నిలువనున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద డోమ్‌లు ఈ ఆలయానికి ఉన్నాయి. ఈ రాధా మాధవుడి ఆలయ ప్రధాన మందిరంలో ఒకేసారి 10 వేల మంది ప్రార్థనలు చేసుకోవచ్చు. 2010లో ప్రారంభమైన దీని నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చింది. 2024 ఆఖరులో ప్రారంభోత్సవం జరిగే అవకాశం ఉన్నది.

శ్రీ జగన్నాథ్ పూరీ హెరిటేజ్ కారిడార్-ఒడిశా

దీన్ని జనవరి 17న భక్తులకు అంకితం చేయనున్నారు. ఒడిశాలోని ఐకానిక్ జగన్నాథుడి ఆలయం చుట్టూ 1.5 కిలోమీటర్ల మేర పరిసరాలను సుందరీకరణ చేయడానికి ఉద్దేశించిన ఈ ప్రాజెక్టు వ్యయం రూ.943 కోట్లు. ఇది ఒడిశా ఆధ్యాత్మిక, సాంస్కృతిక చరిత్రలో గుర్తుంచుకోదగిన అడుగు కానున్నది.

విరాట్ రామాయణ ఆలయం-బీహార్

తూర్పు చంపారన్‌లో రూ.500 కోట్లతో చేపట్టిన ప్రపంచంలోనే అతిపెద్ద రామాయణ ఆలయ నిర్మాణం 2024 చివరకు పూర్తి కానున్నది. 270 అడుగుల డోమ్ ఎత్తుతో ఈ ఆలయం అంగ్‌కోర్ వాట్ గుడిని దాటిపోనున్నది. 12 డోములతో కూడిన ఈ ఆలయాన్ని 3.76 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఆలయంలో 33 అడుగుల నల్ల గ్రానైట్ శివలింగం ఉంటుంది.

మూడు నేర బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: బ్రిటిష్ కాలంనాటి చట్టాలకు బదులుగా పార్లమెంటు ఇటీవల ఆమోదించిన మూడు నేర బిల్లులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఆమోదం తెలిపారు. దీంతో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య చట్టం చట్టాలుగా మారాయి. భారత శిక్షా స్మృతి, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, భారతీయ సాక్ష్యా ధార చట్టం, 1872లకు బదులుగా వీటిని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ బిల్లులపై పార్లమెంటులో మాట్లాడుతూ, శిక్ష విధించడం కన్నా న్యాయాన్ని అందజేయడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టామన్నారు. దేశంలోని క్రిమినల్ జస్టిస్ సిస్టమ్‌ను సంపూర్ణంగా ప్రక్షాళన చేయడం కోసం ఈ కొత్త చట్టాలను రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది. మరోవైపు టెలికం బిల్లుకు కూడా రాష్ట్రపతి ఆమోదం తెలిపారు.

దక్షిణాది ప్రజలు నల్లవారు

- **బీజేపీ మాజీ ఎంపీ వీడియో షేర్ చేసిన డీఎంకే**

చెన్నై, డిసెంబర్ 25: హిందీ మాట్లాడే వాళ్లపై డీఎంకే ఎంపీ దయానిధి మారన్ చేసిన వ్యాఖ్యలపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో బీజేపీ నాయకుడు తరుణ్ విజయ్ దక్షిణాది వారిని నల్ల జాతీయులుగా పిలిచిన పాత వీడియోను సోమవారం డీఎంకే ఐటీ విభాగం షేర్ చేసింది. 'మేము జాత్యంహకారులమైతే మనకు మొత్తం దక్షిణాది ఎందుకు ఉంటుంది? మేం వారితో ఎందుకు జీవిస్తాం? మన చుట్టూ నల్ల జాతీయులున్నారు' అని మాజీ రాజ్యసభ ఎంపీ అయిన విజయ్ ఆ వీడియోలో వ్యాఖ్యానించారు. 2017లో అల్‌జజీరా టీవీ చర్చ సందర్భంగా విజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత తన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పారు.

మీరు 38 ఏండ్లప్పుడు కాంగ్రెస్‌ను చీల్చినట్టే..

పూణె, డిసెంబర్ 25: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ చీలిక వర్గం నేత అజిత్ పవార్ ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్‌పై ఆదివారం విమర్శలు గుప్పించారు. 'కొందరు' 38 ఏండ్ల వయసులో చేసినట్టు కాకుండా.. తాను 60 ఏండ్ల వయసులో ఒక నిర్ణయం తీసుకున్నానని అన్నారు. 1978లో శరద్ పవార్ 40 మంది ఎమ్మెల్యేలతో బయటకు వెళ్లిపోయి కాంగ్రెస్ నేతృత్వంలోని వసంత్ దాదా పాటిల్ ప్రభుత్వం కూలిపోవడానికి కారణమయ్యారని అజిత్ అన్నారు. పాటిల్ మంచి నాయకుడైనా ఆయనను పక్కన పెట్టి జనతా పార్టీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసి శరద్ పవార్ సీఎం అయ్యారని తెలిపారు. ఆయన 38 ఏండ్ల వయసులో చేసింది తాను 60 ఏండ్ల వయసులో చేశానని.. దీన్ని ఆయన అర్థం చేసుకోవాలని అన్నారు. అజిత్ వ్యాఖ్యలపై శరద్ పవార్ సోమవారం స్పందించారు. 1978లో జరిగింది తిరుగుబాటు కాదని, పరస్పర సంప్రదింపుల అనంతరం తీసుకున్న నిర్ణయమని చెప్పారు.

ఇండియా కూటమిలో నాకు పదవొద్దు: నితీశ్

పాట్నా, డిసెంబర్ 25: ప్రతిపక్ష ఇండియా కూటమిలో తనకు ఏ పదవీ వద్దని బీహార్ సీఎం నితీశ్‌కుమార్ చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'వేర్వేరు పార్టీల నాయకులు నా గురించి మాట్లాడుతున్నారు. ఇండియా కూటమిలో నితీశ్‌కు కీలక పదవి ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నారు. కానీ నాకు ఏ పదవీ వద్దని మొదటి నుంచి చెప్తున్నాను. కాకపోతే నా విజ్ఞప్తి ఒక్కటే.. వీలైనంత త్వరగా సీట్ల సర్దుబాటును తేల్చాలి' అని తెలిపారు.

అయోధ్యలోకి వీవీఐపీలకే అనుమతి!

సాధారణ యాత్రికుల హోటల్ బుకింగ్స్ రద్దు • యోగి సర్కార్ ఆదేశాలు!

లక్నో, డిసెంబర్ 25: అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవాన్ని కనులారా వీక్షించాలని కోరుకుంటున్న సామాన్యుల ఆశలపై యోగి సర్కార్ నీళ్లు చల్లుతున్నది. బడా వ్యాపారులు, రాజకీయవేత్తలు, సినీ నటులు, సాధువులు.. అత్యంత ప్రముఖుల (వీవీఐపీ)కు మాత్రమే అక్కడి హోటల్స్ గదులు కేటాయిస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తాయి. రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి సంబంధించి అధికారిక అనుమతి ఉంటేనే హోటల్స్‌లోకి రానివ్వాలని, లేదంటే వారి బుకింగ్స్ వెంటనే రద్దు చేయాలని నగరంలోని హోటల్ యజమానులకు యోగి సర్కార్ నుంచి తాఖీదులు అందినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. 'సీఎం యోగి ఉన్న తాధికారులతో కొద్ది రోజుల క్రితం సమీక్ష నిర్వహించారు. వీలైనన్ని హోటల్ గదులు వీవీఐపీలకు అందుబాటులో ఉండేలా అధికారులకు సీఎం యోగి సూచించారు' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ ప్రభుత్వ అధికారి మీడియాకు తెలిపారు.

అయోధ్యలో వేగంగా రూపుదిద్దుకుంటున్న రామ మందిరం

బుకింగ్స్ రద్దు లేదా వాయిదా

సాధారణ యాత్రికుల రూమ్ బుకింగ్స్‌ను రామాయణ, క్రినోస్కో హోటల్, సిజినెట్ కలెక్షన్, కేకే హోటల్, పార్క్ ఇన్ బై రాడిసన్.. మొదలైన ప్రఖ్యాత హోటల్స్ రద్దు చేస్తున్నాయని, లేదంటే వాటిని వేరే తేదీకి వాయిదా వేస్తున్నాయని వార్తలు వెలువడ్డాయి. 'మా హోటల్‌లోని 60 గదులు ప్రభుత్వమే తీసుకుంది. ఇప్పటివరకు 10 బుకింగ్స్ రద్దు చేశాం. మరికొన్నింటిని రద్దు చేయనున్నాం' అని క్రినోస్కో హోటల్ ఉద్యోగి ఒకరు చెప్పారు. బుకింగ్స్‌ను రద్దు చేయటం కాకుండా మరో రోజుకు మార్చుతున్నామని కేకే హోటల్ తెలిపింది. జనవరి 22న నగరానికి వచ్చినా.. దర్శనానికి అనుమతి ఉండదని యాత్రికులకు చెబుతున్నామని ప్రముఖ హోటల్ మేనేజర్ తెలిపాడు. అయితే సాధారణ భక్తుల హోటల్ బుకింగ్స్ రద్దు చేస్తున్నారన్న వార్తల్ని అయోధ్య మున్సిపల్ కమిషనర్ విశాల్ శర్మ ఖండించారు. భద్రతా పరమైన ఏర్పాట్లలో భాగంగానే ఇదంతా చేస్తున్నామని చెప్పారు.

హోటల్ గదుల ధరలు రూ.లక్షల్లో

రామమందిర ప్రారంభోత్సవం సమీపిస్తుండటంతో అయోధ్యలో హోటల్ గదుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో, అక్కడి హోటల్ నిర్వాహకులు భారీగా రేట్లు పెంచేశారు. కొన్ని చోట్ల హోటల్ గదుల ధరలు రూ.లక్షకు చేరుకున్నాయి. మరోవైపు రామ మందిరానికి సమీపంలో విలాసవంతమైన గుడారాలను భక్తుల కోసం ఏర్పాటుచేశారు. 'టెంట్ సిటీ' పేరుతో నిర్మించిన ఈ గుడారాల్లో 5 నక్షత్రాల హోటల్స్‌కు ఏమాత్రం తీసిపోకుండా వసతి సౌకర్యాలున్నాయట.

బెత్లెహాంలో జనం సందడి లేక బోసిపోయిన నేటివిటీ చర్చి

బోసిపోయిన బెత్లెహాం

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంతో కళ తప్పిన క్రిస్మస్

బెత్లెహాం: జీసస్ జన్మించిన బెత్లెహాంలో క్రిస్మస్ కళతప్పింది. ప్రతి సంవత్సరం ఇక్కడికి యాత్రికులు పోటెత్తుతారు. కానీ ఈ ఏడాది ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం వల్ల యాత్రికులు ఇక్కడికి రాలేదు. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, సావనిర్ షాపులు జనం లేక వెలవెలబోతున్నాయి. దక్షిణ ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదులు అక్టోబరు 7న దాడి చేశారు. ఆ తర్వాత హమాస్ ఆధీనంలో ఉన్న గాజాపై ఇజ్రాయెల్ సైన్యం దాడి చేస్తున్నది. అదే సమయంలో ఇజ్రాయెల్ స్వాధీనంలో ఉన్న వెస్ట్ బ్యాంక్‌లో హింస పెరుగుతున్నది. దీంతో బెత్లెహాంకు ఎవరూ వెళ్లడం లేదు. బెత్లెహాంలో నాలుగు తరాల నుంచి జీవిస్తున్న ఓ కుటుంబంలోని కొందరు ప్రస్తుతం ఓ హోటల్‌ను నిర్వహిస్తున్నారు. వీరు మాట్లాడుతూ, కనీసం ఒక గెస్ట్ అయినా రాలేదని వాపోయారు. ఇంత దయనీయ పరిస్థితుల్లో క్రిస్మస్ ఎన్నడూ జరగలేదన్నారు. క్రిస్మస్ ట్రీని పెట్టలేదని, ఆనందం లేదని, క్రిస్మస్ స్ఫూర్తి లేదని చెప్పారు.

పౌరుల అనుమానాస్పద మృతి..

బ్రిగేడియర్‌పై ఆర్మీ విచారణ

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని పూంచ్‌లో ముగ్గురు పౌరుల అనుమానాస్పద మృతిపై ఆర్మీ దర్యాప్తు చేస్తున్నది. బ్రిగేడియర్ స్థాయి అధికారిని విచారణ చేస్తున్నట్టు సైనిక వర్గాలు సోమవారం వెల్లడించాయి. అధికారి బాధ్యత ఉన్న ఏరియాలో ఉగ్రవాదుల దాడుల్లో జవాన్ల మరణాల ఘటనలు పునరావృతం అవుతుండటంపై కూడా దృష్టి పెడుతున్నట్టు తెలిపాయి. గత గురువారం పూంచ్ జిల్లాలో ఆర్మీ కాన్వాయ్‌పై ఉగ్రవాదులు జరిపిన ఆకస్మిక దాడిలో నలుగురు జవాన్లు అమరులైన విషయం తెలిసిందే. ఎన్‌కౌంటర్ సమీపంలో ముగ్గురు పౌరులు అనుమానాస్పద స్థితిలో మరణించడం సంచలనంగా మారింది. కస్టడీ హింస కారణంగానే వాళ్లు మరణించారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.

ధన్‌కర్‌ను మళ్లీ అనుకరించిన టీఎంసీ ఎంపీ

- **వెయ్యి సార్లైనా చేస్తాను.. ఇది ఓ కళ: ఎంపీ కల్యాణ్ బెనర్జీ**
- **అహంకార వైఖరని బీజేపీ విమర్శ**

కల్యాణ్ బెనర్జీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: పార్లమెంట్ ప్రాంగణంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ హావభావాలను అనుకరించడంపై(మిమిక్రీ) వివాదం రేగినా టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ వెనక్కు తగ్గలేదు. పశ్చిమబెంగాల్‌లోని శ్రీరామ్‌పూర్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో బెనర్జీ మరోసారి ధన్‌కర్‌ను అనుకరించడం వివాదంగా మారింది. 'నేను ఈ విధమైన మిమిక్రీ చేస్తూనే ఉంటాను. ఇది ఒక కళ. అవసరమైతే వెయ్యి సార్లు అయినా చేస్తాను. నా అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు నాకు ప్రాథమిక హక్కులు ఉన్నాయి. నన్ను జైల్లో పెట్టినా.. వెనకడుగు వేసేది లేదు' అని చెప్పారు. దీనిపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ.. సీఎం మమతా బెనర్జీ దన్ను చూసుకొని టీఎంసీ పార్టీలో అహంకారం తారాస్థాయిలో ఉన్నదని విమర్శించారు. వారు రాజ్యాంగబద్ధమైన పదవిని హేళన చేసినా, రైతు కొడుకుని అవహేళన చేసినా, వెనుకబడిన కులాలకు చెందిన వారిని ఎగతాళి చేసినా జైలుకు వెళ్లరు, కానీ ప్రజలు ఎప్పటికీ క్షమించరని అన్నారు.

స్క్రీన్ షేరింగ్ అడిగి సొమ్ము కాజేస్తారు

- **వాట్సాప్ కాల్స్‌తో సైబర్ మోసాలు**

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా వాట్సాప్‌లోని స్క్రీన్ షేరింగ్ సదుపాయాన్ని ఇందుకోసం వాడుతున్నారు. ఇందులో రియల్ టైమ్‌లో ఫోన్ స్క్రీన్ షేర్ చేసేలా స్కామర్లు యూజర్లను మభ్య పెడతారు. అత్యవసరం ఉన్నదని, ఫోన్ సంబంధిత సమస్యల్లో సాయం చేస్తామని చెప్తూ వారు ఈ మోసాలకు పాల్పడతారు. యూజర్లు స్క్రీన్ షేర్ చేయడం ప్రారంభించగానే వారికి తెలియకుండానే వారి స్క్రీన్ మీద జరిగే ప్రతిదీ రియల్ టైమ్‌లో చూడటానికి స్కామర్లకు అవకాశం లభిస్తుంది. దీంతో కేటుగాళ్లు ఆ సమయంలో యూజర్లు చూసే వాట్సాప్ సందేశాలే కాకుండా బ్యాంకు ఖాతాల ఓటీపీల వంటి సున్నిత సమాచారం, సోషల్ మీడియా ఇతర ముఖ్యమైన సమాచారాన్ని కూడా చూడగలుగుతారు. ఈ సమాచారం సాయంతో బ్యాంకు ఖాతాలు కొల్లగొట్టడానికి ఓటీపీలను దొంగిలించడం, యూజర్ సోషల్ మీడియా ఖాతాల పాస్‌వర్డ్‌లు మార్చడం, భవిష్యత్తు ట్రాకింగ్ కోసం మాల్‌వేర్ అమర్చడం వంటివి చేస్తారు.

జాగ్రత్తగా ఉండటం ఎలా?

- తెలియని నంబర్ల నుంచి వాయిస్, వీడియో కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఇలాంటి కాల్స్‌ను నివారించాలి. సందేహం వస్తే మాట్లాడటానికి ముందుగానే కాల్ చేసినవారి వివరాలు ధ్రువీకరించుకోవాలి.
- ఓటీపీలు, క్రెడిట్, డెబిట్ కార్డుల నంబర్లు, సీవీవీ నంబర్లను ఎవరికీ చెప్పకూడదు.
- మీ పాస్‌వర్డులను గోప్యంగా ఉంచుకోవాలి. అధికార సంస్థల తరపున కాల్ చేసిన వ్యక్తులకు కూడా వాటిని చెప్పకూడదు.
- వీడియో కాల్‌లో స్క్రీన్ షేర్ చేస్తున్నప్పుడు మీరు చూపించాలనుకున్న ఫైల్‌ను మాత్రమే తెరచి పెట్టుకోవాలి. పాస్‌వర్డ్‌ల లాంటి సున్నిత సమాచారం రాసుకున్న మెసేజీలు, నోట్ ప్యాడ్స్ వంటి యాప్స్ తెరవకూడదు.

రుణమాఫీ కోసం రైతులు కరువును కోరుకుంటరు!

మొదటిపేజీ తరువాయి...

మాట్లాడారు. కరువు రావాలనేది వారి కోరికని, తద్వారా ప్రభుత్వాన్ని తమ రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేయొచ్చనేది వారి అలోచన అని వ్యాఖ్యానించారు. బెళగావిలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి శివానంద్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రైతులకు కృష్ణా నది నీళ్లు, కరెంట్ ఉచితంగా లభిస్తున్నా ఒకే కోరిక ఉన్నది. ప్రతి సారి కరువు రావాలని వారు కోరుకుంటున్నారు. తద్వారా ప్రభుత్వాన్ని రుణమాఫీ డిమాండ్ చేయవచ్చన్నది వారి ఆలోచన' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. మంత్రి శివానంద్ పాటిల్ రైతులపై గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ఆత్మహత్య చేసుకొన్న రైతు కుటుంబాలకు ప్రభుత్వం అందించే పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచిన తర్వాత రైతుల ఆత్మహత్యలు గణనీయంగా పెరిగాయని వ్యాఖ్యానించారు.

ఇది కాంగ్రెస్ సంస్కృతి..

మంత్రి శివానంద్ పాటిల్ తాజాగా రైతులపై చేసిన వ్యాఖ్యలపై విపక్ష పార్టీలు భగ్గుమన్నాయి. ఆయన చేత రాజీనామా చేయించాలని సీఎం సిద్ధరామయ్యను డిమాండ్ చేశాయి. అన్నదాతలను పదేపదే అవమానించడం, రైతులను కించపరచడం కాంగ్రెస్ పార్టీ సంస్కృతిగా మారిందని కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర విమర్శించారు. మంత్రి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక వైఖరికి నిదర్శనమని దుయ్యబట్టారు. రైతులకు ఏమిచ్చినా అది రాష్ట్రాభివృద్ధికే తప్ప భిక్ష కాదని హితవు పలికారు. 'రైతులు ఆత్మగౌరవం ఉన్నవారు. పరిహారం కోసం వారు ఆశపడరు' అని పేర్కొన్నారు.

క్షమాపణలు చెప్పాలి: కుమారస్వామి

మంత్రి శివానంద్ పాటిల్ రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ సీఎం కుమారస్వామి డిమాండ్ చేశారు. అన్నదాతల కష్టాలు, నష్టాలను కించపరిచేలా మాట్లాడం కాంగ్రెస్ నేతలకు తగదని అన్నారు. మంత్రులు సంయమనంతో మాట్లాడాలని హితవు పలికారు. రైతులు తమ హక్కులనే అడుగుతారు తప్ప బిక్ష కాదని అన్నారు.

రైతులెవరూ కరువు కోరుకోరు: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): రైతులు ఎలాంటి పరిస్థితుల్లో అయినా కరువు రావాలని కోరుకోరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కర్ణాటక మంత్రి శివానంద్ పాటిల్ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. మంత్రి వ్యాఖ్యల వీడియోను సోమవారం తన ఎక్స్ ఖాతాలో ట్యాగ్ చేస్తూ. 'రైతుల గురించి ఇంత చులకనగా మాట్లాడే వాళ్లు మంత్రులు ఎలా అయ్యారు? రైతులెవరూ కరువు రావాలని కోరుకోరు. ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా ప్రభుత్వమే వచ్చి తమకు సాయం చేయాలని ఎదురు చూడరు' అని పేర్కొన్నారు.

పాక్ ఎన్నికల బరిలో ఉగ్రవాది హఫీజ్ పార్టీ

ఇస్లామాబాద్, డిసెంబర్ 25: పాకిస్థాన్ నేషనల్ అసెంబ్లీ, ప్రొవిన్షియల్ అసెంబ్లీలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో పాకిస్థాన్ మర్కజి ముస్లిం లీగ్ (పీఎంఎంఎల్) పోటీ చేస్తున్నది. 2008 నవంబరు 26న ముంబైలో జరిగిన ఉగ్రవాద దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్ ఈ పార్టీకి మద్దతిస్తున్నాడు. హఫీజ్‌ను ఐక్యరాజ్య సమితి ఉగ్రవాదిగా ప్రకటించింది. అమెరికా అతని తలకు 10 మిలియన్ డాలర్లు వెల కట్టింది. భారత్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ హఫీజ్. వచ్చే ఫిబ్రవరి 8న జరిగే ఈ ఎన్నికల్లో దాదాపు అన్ని స్థానాలకు పీఎంఎంఎల్ పోటీ చేస్తున్నది. హఫీజ్ సయీద్ కొడుకు తల్హా సయీద్ లాహోర్ నేషనల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు తెలుస్తున్నది.

పాక్‌లో ఒక్క గుడ్డు 32 రూపాయలు

ఇస్లామాబాద్: పాకిస్థానీలు కోడి గుడ్లను కొనాలంటేనే భయపడుతున్నారు. పౌల్ట్రీలో ఉపయోగించే సోయాబీన్ సరఫరా తగ్గిపోవడంతో, గుడ్ల ధరలు అమాంతం పెరిగిపోయాయి. 30 డజన్ల గుడ్ల ధర రూ.10,500 నుంచి రూ.12,500కు పెరగడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డజను గుడ్లను రూ.360కి విక్రయించాలని ప్రభుత్వం చెప్పినప్పటికీ, రిటైల్ వ్యాపారులు రూ.389కి అమ్ముతున్నారు. ఒక్కో గుడ్డు ధర రూ.32కి చేరుకుంది. సోయాబీన్స్ దిగుమతికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినప్పటికీ, ఇంకా నోటిఫికేషన్‌ను జారీ చేయలేదు. ద్రవ్యోల్బణం పెరుగుదల కొనసాగుతున్నట్లు ఆల్ పాకిస్థాన్ బిజినెస్ ఫోరం తెలిపింది. ఆహారం, ఇంధనం ధరలు పెరుగుతున్నాయని పేర్కొన్నది.

పర్యాటక ప్రదేశాలు కిటకిట

- **మైసూర్ నుంచి మనాలి వరకు అదే పరిస్థితి**
- **లాంగ్ వీకెండ్ కావడంతో పోటెత్తిన పర్యాటకులు**

క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకల కోసం సోమవారం మనాలికి పర్యాటకులు పోటెత్తడంతో భారీగా ట్రాఫిక్ జామ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: వారంతం సెలవులకు అనుగుణంగా క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలు రావటంతో దేశవ్యాప్తంగా పర్యాటక ప్రదేశాలకు జనం పోటెత్తారు. వివిధ రాష్ట్రాల్లో ప్రఖ్యాత పర్యాటక ప్రదేశాలన్నీ జనంతో కిటకిటలాడుతున్నాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్లమీదకు రావటంతో ట్రాఫిక్ కష్టాలు పర్యాటకుల ఆనందాన్ని ఆవిరిచేస్తున్నాయి. కర్ణాటకలో బెంగళూరు, మైసూర్, కొడగు వంటి పర్యాటక ప్రదేశాల్లో పండుగ సమయాన్ని గడిపేందుకు జనాలు పెద్ద సంఖ్యలో వాహనాల్లో తరలిరాగా, వారి ఆనందాన్ని ట్రాఫిక్ కష్టాలు నీరుగార్చాయి. బెంగళూరు-మైసూరు జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోగా, పర్యాటకులు గంటలకొద్దీ అక్కడే గడపాల్సి వచ్చింది. కొడగు వద్ద రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పండుగ సెలవుల సమయంలో ట్రాఫిక్ ఉంటుందని తెలిసినా, ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదని వాహనదారులు మండిపడ్డారు.

హిమాచల్‌లో డ్రోన్‌తో పర్యవేక్షణ

ఉత్తరాదిన మనాలి, కాసోల్, సిమ్లా సహా పలు ప్రదేశాల్లోనూ పర్యాటకులు నానా అవస్థలకు గురయ్యారు. సుందరమైన కొండ ప్రాంతాల్లో పండుగ సెలవుల్ని గడుపుదామని వచ్చిన పర్యాటకుల్ని అక్కడి ట్రాఫిక్ పరిస్థితి నిరాశపర్చింది. జాతీయ రహదారులపై టోల్ బూత్‌ల వద్ద గంటల కొద్దీ వాహనాల్ని నిలపలేక ఇబ్బందిపడ్డారు. లాహౌల్, స్పితి జిల్లాల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశముందని జిల్లా యంత్రాంగం అందోళన వ్యక్తం చేసింది. పర్యాటకుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ కోసం లాహౌల్, స్పితి జిల్లాల్లో పోలీసులు డ్రోన్ సహాయంతో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. జాతీయ రహదారిపైన అటల్ టన్నెల్ నుంచి మనాలి వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. కనీసం పార్కింగ్‌కు అవకాశం లేకుండా ఉందని పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మహిళా టెకీ సజీవ దహనం

- **దారుణంగా చంపిన స్నేహితుడు**
- **పెండ్లి చేసుకునేందుకు లింగమార్పిడి**

చెన్నై: వారిద్దరూ స్నేహితులు. కలిసి చదువుకొన్నారు. ప్రస్తుతం ఒకే సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆ ఇద్దరు యువతుల్లో ఒకరు మరొకరిపై ఉన్న ప్రేమతో పెండ్లి చేసుకొనేందుకు లింగ మార్పిడితో పురుషుడిగా మారారు. అయితే తాను ప్రేమించిన యువతి.. మరొకరిని ప్రేమిస్తున్నదన్న అనుమానంతో అతి కిరాతకంగా హత్య చేశాడు. చైన్లతో కట్టేసి, బ్లేడుతో గొంతు కోసి, పెట్రోల్ పోసి సజీవ దహనం చేశాడు. ఈ దారుణ ఘటన తమిళనాడులోని కెలంబక్కమ్‌లో చోటుచేసుకొన్నది. పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. మధురైకి చెందిన నందిని, లింగ మార్పిడితో వెట్రిమారన్‌గా మారిన మహేశ్వరి ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. మధురైలో కలిసి చదువుకొన్నారు. పురుషుడిగా మారిన తర్వాత కూడా వెట్రిమారన్ అలియాస్ మహేశ్వరితో నందిని స్నేహం కొనసాగించింది. అయితే నందిని మరో వ్యక్తిని ప్రేమిస్తున్నదన్న అనుమానంతో ఆమె పుట్టినరోజున సర్‌ప్రైజ్ ఇస్తానని వెట్రిమారన్ పిలిచాడు. తాను చెప్పిన ప్లేస్‌కు వచ్చిన నందినిని వెట్రిమారన్ చైన్లతో కట్టేసి గొంతు కోశాడు. అనంతరం పెట్రోల్ పోసి నిప్పంటించాడు.

నేడు నౌకాదళంలోకి 'ఐఎన్ఎస్ ఇంఫాల్'

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన యుద్ధనౌక 'ఐఎన్ఎస్ ఇంఫాల్' మంగళవారం నౌకాదళంలో చేరనున్నది. ముంబైలోని డాక్‌యార్డ్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ నౌకను నావికాదళానికి అప్పగిస్తారు. ఇది స్టెల్త్ గైడెడ